## నవ్య వీక్లి - పసుపులేటి లక్ష్మీనారాయణ స్మృతిసాహితి కథల పోటీలో


# రూ. 2,500 తృతీయ బహుమతి పొందిన కథ

"బాలత్రిపుర సుందరీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి వారి దేవాలయంలో కొలువైయున్న శ్రీ వల్లీ సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా కళ్యాణ మహోత్సవము. కార్యక్రమం: ఉదయం 6 గంటలకు స్వామి వారికి క్షీరాభిషేకం, తదుపరి అలంకారం, అర్చన. రాత్రి 8 గంటలకు చర్మ చిత్రకళా ప్రదర్శన (తోలు బొమ్మలాట). భక్తు లెల్లరూ పాల్గొని స్వామి వారి కృపా కటాక్ష వీక్షణములకు పాత్రులు కాగలరు. ఇట్లు, ధర్మకర్త."

కరపత్రం చదువుకుంది వసుధ. క్రిందటేడు తన భర్త ఉత్సవాలని ఎంత ఉత్సాహంగా నడిపించిందీ గుర్తు కొచ్చిందామెకు. ఉత్సవాలే కాదు దేవాలయంలో ప్రతి ఆధ్యాత్మిక కార్యక్రమం దేవస్థానం వేద పండితుడిగా ఆయన ఆధ్వర్యంలోనే జరుగుతూ వుంటుంది. మూడు పదుల వయసుకే వేదాధ్యయనం పూర్తి చేసి, ఆగమ శాస్త్రంలో అపార పాండిత్యం సంపాదించిన తన భర్త అంటే ధర్మకర్త గారికీ, ఊళ్లో వారికీ గౌరవం, భక్తి ప్రపత్తులూనూ. వారి ధర్మపత్నిగా తాను కూడా ఆ గౌరవంలో పాలు పంచుకుంటున్నందుకు, భర్త సేవతోబాటు భగవత్సేవ చేసుకునే భాగ్యం కూడా కలిగినందుకు వసుధ సంతోషపడని రోజు లేదు.

# బొమ్మలాట

### సరసి



''వసూ! నిన్ను ఒంటరిగా వదిలి వెడుతున్నాను. నెలల పిల్లాడితో ఎలా వేగుతావో ఏమో. నీకు తెలుసు, మరొకటీ మరొకటీ అయితే వెళ్లే వాడిని కాదు. పుష్కరానికో మాటు జరుగుతాయి ఈ సపరికర అద్వైత వేదాంత మహాసభలు. కాశీలో విశ్వేశ్వరుడి సన్నిధిలో ఇవి జరగడం, నాకు ఆహ్వానం రావడం మహాభాగ్యంగా భావిస్తున్నాను. పది రోజుల్లో వచ్చేస్తాను. నువు ధైర్యంగా ఉండు. అవసరమైతే పక్కింటి వాళ్ల పిల్లలెవర్నైనా తోడు పడుకో బెట్టుకో. చంటాడు జాగ్రత్త.'' అంటూ తన భర్త కాశీ వెడుతూ చెప్పిన మాటలను గుర్తుకు తెచ్చుకుంది వసుధ.

అప్పుడే పాలు తాగి నిద్రపోతున్న కొడుకుని ముద్దాడబోయి, నిద్రపోతున్న పిల్లల్ని ముద్దు పెట్టుకోకూడదని తన తల్లి చెప్పింది గుర్తు కొచ్చి ఆగింది. పిల్లవాడి జుట్టు కళ్లల్లోకి పడకుండా పైకి తోసి, తన చేతి వేళ్లని ముద్దు పెట్టుకుంది.

***

షష్ఠి రోజున గుమ్మం లోపల కూర్చుని తీర్థానికి పొరుగూళ్ల నుంచి వచ్చిపోతున్న జనాలని చూడసాగింది వసుధ. ఇంతలో ఒకామె చంకలో పిల్లనెత్తుకుని గుమ్మం ముందుకొచ్చి నిలబడింది.

''దణ్ణాలమ్మా. తోలు బొమ్మలాట వాళ్లం. ఆలయం వెనక తోటలో బస చేశాం. రాత్రి కిక్కడ ఆట కదా. తెర కట్టడానికి రెండు తెల్ల చీరలిప్పించండమ్మా. ఆట అయిపోగానే భద్రంగా తెచ్చిస్తా.'' అంది దణ్ణం పెడుతూ. ఆమె చెబుతూవుంటే మాట తొణగనీయకుండా ఆమె ఎత్తుకున్న బిడ్డ గుక్క పట్టి ఏడుస్తోంది.

''ఇంట్లో తెల్ల చీరలెక్కడున్నాయి? అన్నీ రంగు చీరలే.'' అంది వసుధ.

''ధర్మకర్త గారు ఈ ఇంటి కెళ్లి అడగమన్నారు. చూడండి తల్లీ.''

తన తల్లివి రెండు మూడు పాత చీరలు భోషాణం పెట్లో ఉండాలని వసుధకి గుర్తు కొచ్చింది. ''మీరు బొమ్మలు తగిలించడానికి ఈత ముళ్లు గుచ్చి చీరలు పాడు చేస్తారు. ఇదివరకోసారి మంచి చీరలిస్తే చిల్లులు పొడిచి తెచ్చారు.'' అంది వసుధ లోపలి కెళ్లి చీరలు తెచ్చిస్తూ.

''శివ శివ! కావాలని పాడు చేస్తామా తల్లీ. భద్రంగా తెచ్చిస్తా. పండిత కుటుంబం తమది. సర్వేశ్వరుడు మిమ్మల్ని, మీ పిల్లల్ని సర్వదా కాపాడాలి!'' అందామె చీరలు తీసుకుంటూ.

ఆమె భాషకి మాటల్లో ద్యోతకమవుతున్న సంస్కారానికి ముచ్చట పడింది వసుధ. మంచి భాష మంచి సంస్కారానికి దర్పణం లాంటిది. సాధారణంగా తోలు బొమ్మలాటల వాళ్లు తెలుగు వాళ్లు కారు. వాళ్లల్లో వాళ్లు వేరే కాసర బీసర భాషేదో మాట్లాడుకున్నా బయట వారితో మాత్రం చక్కని తెలుగులో స్పష్టమైన ఉచ్చారణతో మాట్లాడతారు. చిన్నప్పటి నుంచీ తప్పనిసరిగా పెద్ద బాల శిక్షతో బాటు పురాణాలు కూడా వల్లె వేయడం వల్ల వారికా విద్య అబ్బుతుంది.


''ఏం కథ చెబుతున్నారీ రోజు?''

''సుందర కాండమ్మా. నాలుగు రోజులు చెబుతున్నాం. ఒక్క రోజులో కూడా చెప్పొచ్చు. అయితే కథ పరంగా చూస్తే సుందరమైన ఈ కథలో...'' ఆమె ఏదో మాట్లాడుతోంది కానీ అది వినబడనీయకుండా పెద్ద గొంతుతో ఏడుస్తోంది చంకలో ఉన్న ఆమె బిడ్డ. ఒక పక్క మాట్లాడుతూనే, రెండో పక్క భుజం ఎగరేస్తూ బుజ్జగిస్తోంది తల్లి. అయినా ఆ పిల్ల ఏడుపు ఆపడం లేదు.

''ముందు దాన్ని ఊరుకోబెట్టు. పాలు తాగుతోందా?'' అడిగింది వసుధ.

''తాగుతుందమ్మా. ఉంటే. నా దగ్గర లేవు. బయటి పాలు తాగదు. చాలా కష్టంగా ఉంది ఈమెతో. వస్తానమ్మా. రాత్రి మా ఆట తమరు సొంతం చూడాలి. ఆశీర్వదించాలి.'' అంటూ వెళ్లి పోయిందామె.

ఆమె వెళ్లేక వసుధ మనసులో ఏదో వెలితి ఏర్పడినట్టయింది. ఆ చంటి పిల్లను తీసుకుని తను పాలిచ్చి వుండాల్సింది. ఆ ఆలోచన మనసులోకి వచ్చిన మాట వాస్తవం. అయితే చూస్తూ చూస్తూ ఆకలితో ఏడుస్తున్న పిల్లని కడుపు నింపకుండా ఎలా పంపగలిగింది తను? ఎందువల్ల చొరవ చేయలేకపోయింది? పరాయి పిల్ల అనా? లేక తక్కువ కులం పిల్ల అనా? ఏమో అదేనేమో! తన చెల్లి కూతురో అక్క కూతురో పక్కనే కూర్చుని రోదిస్తూ వుంటే తను పట్టనట్టు ఉండేది కాదు కదా. దగ్గరే తన భర్త వుండివుంటే ఒక వేళ ఒక చంటిబిడ్డ తల్లిగా తాను ఆ పిల్లను ఆదరించినా, ఆయన అంగీకరించడు కదా! ఆయన కంగీకారం లేని పని తను ఎన్నడూ చేసి ఎరగదు. ఆమె ఆలోచనలు అటూ ఇటూ ఊగిసలాడుతున్నాయి. ఆ సందర్భంలో తన తల్లి చెప్పినది ఒకటి గుర్తు కొచ్చింది వసుధకి. తన చిన్నతనంలో తల్లికి జబ్బు చేసినపుడు పాలేరు భార్య కొద్ది రోజులు తనకి పాలిచ్చిందట! లేకపోతే తను బతికేదే కాదట! తన తండ్రిది కూడ శుద్ధ శ్రోత్రియ కుటుంబమే మరి. అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడు మాత్రం ఎందుకు రావాలి? పాలకి కులం, గోత్రం, అంటూ, సొంటూ ఉండవనడానికి ఇంతకన్న ఇంకేం కావాలి? తను పొరబాటు చేసింది. నిజమే! పాపం ఆ పిల్ల ఆకలితో ఎంత అలమటిస్తోందో! వసుధ గుండె పిండినట్టయింది.



రాత్రి తోలు బొమ్మలాట ప్రారంభమైంది. దేవాలయానికి అతి చేరువలోనే ఉన్న ఇల్లు కావడం చేత ఇల్లు కదలకుండానే ఆట చూసే వీలుంది వసుధకి. తను గుమ్మంలోపలే తలుపుకి ఆనుకుని కూర్చుంటే, బొమ్మలాట కనిపించడంతో బాటు వాళ్లు చెప్పే కథ కూడా స్పష్టంగా వినిపిస్తుంది.

ముందుగా గణేశ ప్రార్థన చేశారు. అంతకు ముందే రాముడు, లక్ష్మణుడు, హనుమంతుడు, జాంబవంతుడు, మిగిలిన వానరాలతో బాటు జుట్టు పోలిగాడు, కేతిగాడు, బంగారక్కల బొమ్మలతో తెర అంతా నింపేశారు.

ప్రార్థన తర్వాత ఒక స్త్రీ కీచు గొంతుకతో పాటందుకుంది. ''అక్క వచ్చే బంగారక్కా'' అనగానే, ''అక్క వచ్చే బంగారక్కా'' అంటూ కోరస్‌గా మిగిలిన గొంతులు వంతపాడేయి. బంగారక్క బొమ్మ నృత్యం చేస్తూ కథ చెప్పడం ప్రారంభించింది. కథ అలా ఆరంభమైందో లేదో వెనకనే చంటిపిల్ల ఏడుపు ప్రారంభించింది. తోలు బొమ్మల మధ్య నున్న ఖాళీల్లోంచి లోపలి దీపాల వెలుగులో ఆటాడించే వాళ్లు బయటకు కనిపిస్తున్నారు. కథ చెప్పేది ఉదయం తన వద్దకు వచ్చిన చంటి పిల్ల తల్లేనని గుర్తు పట్టింది వసుధ. మిగిలిన వాళ్లు తొట్టెలో ఉన్న బొమ్మల్ని ఒక్కొక్క దాన్నీ తీసి, వాటి మధ్యలో గుచ్చిన వెదురు బద్దల్ని సరిచేస్తూ, తెరకెక్కించడం కోసం సిద్ధం చేస్తున్నారు. తారాస్థాయిలో విలపిస్తున్న తన కూతుర్ని ఒక పక్క సముదాయిస్తూనే, మరో వైపు ఓ చెవి మూసుకుని గొంతెత్తి పాట పాడుతూ కథ చెబుతున్న ఆ తల్లి అవస్థ చూసేసరికి వసుధకి జాలేసింది. బొమ్మలాటల వాళ్లు పెద్ద గొంతుకలతో మైకు అవసరం లేకుండానే కథ చెబుతారు. దూరాన్న ఉన్న వారికి కూడా ఆ గొంతులు వినిపించేలా ఉంటాయి. అయితే, ఆ చంటి పిల్ల కూడా వారితో సమానంగా పై స్థాయిలో ఏడుపు లంకించుకునే సరికి కథ వినబడని జనం అల్లరి చెయ్యడం ప్రారంభించారు. అది కాస్తా కొద్దిసేపటికి పెద్ద గోలగా తయారై చివరికి బొమ్మలాట ఆగిపోయే దాకా వచ్చింది.

అదంతా చూస్తున్న వసుధ ఒక నిర్ణయాని కొచ్చింది. కాస్తంత దూరంలో ఎండుగడ్డి మీద బరకం పరుచుక్కూర్చుని ఆట చూస్తున్న వాళ్లలో ఒక కుర్రాడిని పిలిచి చెవిలో ఏదో చెప్పింది. అతడు బొమ్మలాట టెంటు వెనక వైపుకి వెళ్లి, ఏడుస్తున్న చంటి పిల్లని, తల్లినీ వెంటబెట్టుకొచ్చాడు.

''కథ కానీండి, అందాక నేను చూస్తాలే నీ పిల్లని.'' అంటూ ఆమె చేతిలోంచి చంటిపిల్లను తీసుకుంది వసుధ. ఒక్క నిముషం ఆశ్చర్యంతో చూసి, కథ చెప్పడం కోసం వెంటనే పరుగెట్టింది ఆపిల్ల తల్లి. ఏడుస్తూ తల్లి వైపు చేతులు చాస్తూ గింజుకుంటున్న ఆ పిల్లని వొడుపుగా పట్టుకుని, రవిక ముడి విప్పి, కొంగు చాటున పాలు పట్టింది వసుధ. పిల్ల ఏడుపు ఆగింది. ఆట మళ్లీ ప్రారంభమైంది.

మూడు గంటలు సాగిన ఆ బొమ్మలాటలో



## తీపిజ్ఞాపకాలు

పశ్చిమ గోదావరి జిల్లా బోడపాడు అగ్రహారంలో శివాలయం పక్కనే మా ఇల్లు. ప్రతి ఏడూ సుబ్బారాయుడు షష్ఠికి తోలుబొమ్మలాట పెట్టించే వారు మా నాన్నగారు. పిల్లాజెల్లాతో వచ్చి నాలుగు రోజులు బస చేసే ఆ బొమ్మలాట వాళ్లకి అన్నం పెట్టి, బట్టలిచ్చి ఆదరంగా చూసేది మా అమ్మ. మరచిపోలేని ఆ తీపి జ్ఞాపకాల్లోంచి పుట్టిందే ఈ కథ. బహుమతి నిచ్చినందుకు ధన్యవాదాలు.

'సరసి' పేరుతో నా కథలూ, కార్టున్లూ 'నవ్య' పాఠకులకు సుపరిచితమే. హైదరాబాదులో రాష్ట్ర శాసనసభలో రిపోర్టరుగా ఉద్యోగం చేస్తున్న నా పూర్తి పేరు – సరస్వతుల రామ నరసింహం

**– సరసి**

**ప్లాట్ నెం. 56, 3వ వీధి,**
**అనంతసరస్వతీ నగర్, మల్కాజ్‌గిరి,**
**హైదరాబాద్ – 500 047.**
**సెల్: 9440542950**

నాలుగు సార్లు వచ్చి పిల్లని చూసుకు వెళ్లింది తల్లి. 'బిడ్డని వదిలి ఏ తల్లి మాత్రం నిశ్చింతగా వుండగలదు' అనుకుంది వసుధ.

కథ పూర్తి కాగానే హడావుడిగా వచ్చిన ఆమెకు వసుధ వొడిలో తన బిడ్డ ఆమె బిడ్డ ఇద్దరూ హాయిగా నిద్రపోతూ వుండటం కనిపించింది. వస్తూనే ఆమె వసుధ కాళ్లకి దణ్ణం పెట్టి బిడ్డ నెత్తుకుంది.

''నీ బిడ్డ అల్లరి పిల్లేం కాదులే. కడుపు నిండితే హాయిగా పడుకుంటుంది. అన్నట్టు దీనికేం పేరు పెట్టావు?'' అడిగింది వసుధ.

''బంగారి... బంగారక్క!'' అందామె బిడ్డని ముద్దు పెట్టుకుంటూ.

''చక్కటి పేరు. ముద్దొస్తోంది. నీ పేరు?''

''దేవకి''

***

మర్నాడు ఉదయం వసుధ స్నానం చేసి, మడి బట్ట కట్టుకుని పూజ గదిలో అంతకు ముందు రోజు చేసిన పూజ తాలూకు నిర్మాల్యం తీస్తోంది. ఇంతలో ఎవరో పిలిచినట్టయి వీధి గుమ్మం వైపు వచ్చింది. గుమ్మంలో దేవకి పిల్లనెత్తుకు నుంది.

''రాత్రి మీ దయ వల్ల కథ చివరి దాకా ఆటంకం లేకుండా చెప్పుకున్నాం తల్లీ. పెద్ద వారు. మీ వంటి వారు మా వంటి వారిని తాకనే తాకరు. మేము దూరంగా వుండవలసిన వారం. అయినా మీరెంతో పెద్ద మనసుతో నా బిడ్డని ఎత్తుకుని పాలిచ్చారమ్మా. తల్లిగా నేను చెయ్యలేని పని మీరు చేశారు. మీ రుణం ఎట్లా తీర్చుకోగలను? సాక్షాత్తూ ఆ అన్నపూర్ణేశ్వరే ఇలా నాకు ప్రత్యక్షమై....'' అంటూ దేవకి ఏదో చెప్ప బోతూవుంటే వసుధ వారించింది.

''చాల్లే పాలకి పెద్దా చిన్నా ఏమిటి? సరే కానీ, కాస్తంత చద్దన్నం ఉంది పట్టుకెడతావా?'' అడిగింది వసుధ.

''అంతకన్నానా తల్లీ'' అంది దేవకి.

లోపలికెళ్లి గిన్నెలో అన్నం, కాస్త కూర, ఆవకాయ వేసి తెచ్చి, ''తిన్నాక గిన్ని తెచ్చివ్వు'' అంది. ఈ లోగా చంటిపిల్ల ఏడుపు ప్రారంభించింది. దేవకి ఆమె నోరు నొక్కబోయింది.

''ఎందుకలా నోరు మూస్తావు? మనం అన్నం తింటే మన కడుపు నిండుతుంది గాని దాని కడుపు నిండదు కదా. దానిదీ మన లాంటి ఆకలే. ఇలా ఇవ్వు'' అంటూ బంగారిని తీసుకుని, గుమ్మం లోపల కూర్చుని, పాలివ్వసాగింది వసుధ. ''పాలు లేకపోతే ఏ పోతపాలో అలవాటు చెయ్యాలి. ఇలా అయితే ఎలా పెంచుతావు?'' అంది, పిల్లని వొడిలో అనువుగా సర్దుకుంటూ.

పట్టుబట్టతో మడిగా, నిష్టగా కనిపిస్తున్న వసుధ, ఏ మాత్రం సంకోచించకుండా ఆ విధంగా చొరవగా తన బిడ్డని తీసుకుని దాని ఆకలి తీరుస్తున్నందుకు దేవకి కళ్లల్లో నీళ్లు తిరిగేయి. అప్రయత్నంగా ఆమె చేతులు జోడించి, మెట్ల మీద కూర్చుంది.

ఆ రోజు సాయంత్రం ఆట మొదలు పెట్టడానికి ముందే వసుధ దేవకిని పిలిచి, చంటి పిల్లని తీసుకుంది. ఆ రోజు ప్రదర్శన పూర్తి అయ్యేదాకా వసుధ వొడిలోనే ఆకలి తీర్చుకుంటూ, హాయిగా నిద్రపోయింది బంగారి. తర్వాత వచ్చి, కూతుర్ని తీసుకెళ్లింది దేవకి.

ప్రతి రోజూ ఉదయమే దేవకి వచ్చి కొద్ది సేపు కబుర్లు చెప్పి చద్దన్నమో, కూరో పట్టుకెళ్లేది. వసుధని చూస్తూనే చేతులు చాచి ముందుకు దూకేది చంటిపిల్ల. ఆమెను ఆప్యాయంగా తీసుకుని ఆకలి తీర్చడమే కాక, ఆ నాలుగు రోజులూ రాత్రిళ్లు వాళ్లు ఆట ఆడే సమయంలో కూడా తన దగ్గరే ఉంచుకునేది వసుధ.

''బాగా ఆడించారే ఆట'' మర్నాడు వసుధ అంది దేవకితో.

''మేమెవరం తల్లీ ఆడించడానికి? అంతా ఆ పరమాత్మే ఆడిస్తున్నాడు. మనం కూడా ఆ బొమ్మలాటలో భాగమే కదమ్మా'' అంది దేవకి. వసుధ ఆశ్చర్యపోయింది అంత వేదాంతం ఆమె నుంచి వచ్చేసరికి.

ఇదిలా వుండగా వసుధ భర్త ఆ మర్నాడే వస్తున్నట్లు ఉత్తరం వచ్చింది. ఆమె ఆనందపడిపోయి, ఇల్లంతా కడిగి, ముగ్గులు పెట్టింది. పూజ గది శుభ్రం చేసి, భర్త రాగానే జపానికీ, అనుష్ఠానానికీ అన్నీ సిద్ధం చేసి వుంచింది. నాన్న గారొస్తున్నారని కొడుకుతో చెప్పి, వాడికి అర్థం కాకపోయినా ఎన్నో కబుర్లాడి మురిసిపోయింది.

ఆ సాయంత్రం దేవకి మళ్లీ వచ్చింది చంటిపిల్లనెత్తుకుని. వచ్చి ఎంతసేపటికీ ఏమీ చెప్పకుండా అలా నిలబడి వుండేసరికి వసుధే అడిగింది.

"కాలువ అవతల ఆంజనేయ స్వామి గుడిలో ఈ ఒక్క రోజూ బొమ్మలాట పెట్టించారమ్మా" తల వంచుకుని చెప్పింది దేవకి.

"ఓస్ ఇంతేనా? బంగారిని నా కప్పగించడానికా ఇంత మొహమాటం? దీన్ని తీసికెడితే మాత్రం నిన్ను కథ చెప్పనిస్తుందా ఏవన్నానా? ఇలాగివ్వు. నీ పిల్లని నేనేం కొరుక్కు తిన్నన్లే. నా కొడుకుతో బాటే అదీనూ." అంటూ చంటిపిల్లని తీసుకుని దాని బుగ్గ మీద ముద్దు పెట్టింది వసుధ.

"ఎంత మాట తల్లీ. ఈ నాలుగు రోజుల్లో దీని మొహంలో కనిపించినంత ఆనందం ఇది పుట్టేక నేను చూడ లేదు. నిజానికి తల్లంటే మీరేనమ్మా. కనగానే సరా? పాలిచ్చి ఆకలి తీర్చని నేనూ ఓ తల్లినేనా?" అంటూ కొంగు అడ్డు పెట్టుకుని భోరున ఏడ్చింది దేవకి. వసుధ నీరయిపోయింది. ఎలా వోదార్చాలో అర్థం కాలేదామెకు. "మీ దగ్గర పాలు తాగి తాగి ఇంతలోనే దీని పొట్ట ఎంతయిందో చూడండమ్మా" కళ్లు తుడుచుకుంటూ లేని నవ్వును మొహం మీదకి తెచ్చుకుంది. "మీరూ, మీ బిడ్డా పది కాలాల పాటు చల్లగా వుండాలి తల్లీ." అంటూ చేతులు జోడించి వెళ్లింది దేవకి.

రాత్రి భోజనం చేసాక, పిల్లలిద్దర్నీ వొడిలో వేసుకుని గోడకి చేర్లాపడింది వసుధ. ఆలోచనల పుస్తకం తెరుచుకుంది. రేపు తన భర్త ఏ సమయానికి వస్తాడో? ఆయన వచ్చే సరికి తను ఎదురెళ్లి ఎలా స్వాగతం చెప్పాలి? ఆయన కోసం ఏమేమి సిద్ధం చేసి వుంచాలి? కొడుకును విడిచిపెట్టి ఎన్నడూ ఇంతకాలం దూరంగా లేరాయన. కాశీ నుంచి వీడికి ఏం తీసుకొస్తారో? కొడుకు మీది ప్రేమతో తనని మరిచిపోరు కదా? అన్నట్టు, తను మడి కట్టుకోడానికి ధావళీ కొనుక్కోవాలనుకున్నారు, కొనుక్కున్నారో లేదో, వెళ్లేటప్పుడు తను గుర్తు చేసింది కూడా. తీయని ఆలోచనలతో ఎప్పుడో నిద్రలోకి జారుకుంది వసుధ.

తెలతెల వారుతూ వుండగా మెలుకువ వచ్చింది వసుధకి. పక్కనే ఇద్దరు పిల్లలూ ఆదమరిచి నిద్రపోతున్నారు.

అదేవిటీ దేవకి రాత్రి రాలేదా? వచ్చి తలుపు తడితే తనకు మెలుకువ రాలేదా? రాలేదంటే, బహుశా రాత్రిపూట కాలవ దాటించడానికి బల్ల కట్టు వాడు వుండి వుండడు. తెల్లారుతోంది కాబట్టి ఇప్పుడు రావొచ్చు. అనుకుంటూ లేచి గుమ్మం ముందు ఊడ్చి, నీళ్లు జల్లి ముగ్గు పెట్టింది. పూర్తిగా తెల్లవారినా దేవకి రాలేదు. వీధిలో నడిచి వెడుతున్న ఓ రైతుని పిలిచి అడిగింది. అతడు చెప్పింది వినగానే వసుధ గుండె జల్లుమంది.

కాలవ అవతల రాత్రి అసలు బొమ్మలాటే ఆడలేదట. బొమ్మలాట వాళ్లంతా క్రితం సాయంత్రమే సామానుతో సహా, ఊరు విడిచి వెళ్లిపోయారని, తాను స్వయంగా చూశాననీ చెప్పాడతను.

అంటే దేవకి తనతో అబద్ధం చెప్పి, పిల్లని తనకు వదలిపెట్టి వెళ్లిపోయిందా? మళ్లీ ఇంక రాదా? ఇంట్లోకి వెళ్లి బావురుమంది వసుధ. పిల్లలిద్దరూ ఆమె ఏడుపుకి ఉలిక్కిపడి లేచి, వాళ్లు కూడా ఏడుపు ప్రారంభించారు.

"ఎంత పని చేశావే దరిద్రగొట్టు పీనుగా! ఆకలేస్తే అన్నం పెట్టాను కదే. నీతో బాటు నీ కూతురు ఆకలి తీర్చడమే నేను చేసిన తప్పుటే? బిడ్డని పెంచడం కష్టంగా వుందంటే ఎంతో కొంత డబ్బు ఆయన చేత ఇప్పించేదాన్ని కానా? ఇలా నీ బిడ్డని నా పాల పడేసి పోతే నేను మా ఆయనకి ఏం సమాధానం చెప్పుకోవాలి? నేనెలా పెంచాలీ దీన్ని?" లోపల అనుకునేవి పైకే అంటోంది వసుధ. అంటూ పక్కనే ఏడుస్తున్న బంగారిని చూసి, ఆవేశంతో "పాడుపీనుగా, నీ వల్లే వచ్చిందిదంతా" అంటూ ఆ పిల్ల దవడ మీద ఒక్క దెబ్బ కొట్టింది. పిల్ల గుక్క పట్టింది. తన కొడుకుని ఎత్తుకుని గుండెలకు హత్తుకుంటూ "నువ్వు నా బంగారు కొండవిరా నాన్నా! నీకు అన్యాయం చెయ్యన్రా." అంటూ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతూ, ముద్దులు పెట్టుకుంటూ, ఏడుపు కొనసాగించింది వసుధ.

పిల్లలిద్దరూ శృతి పెంచేసి హెచ్చు స్థాయిలో ఏడుపు ప్రారంభించే సరికి వసుధ కాస్త తగ్గింది. తన భర్త ఇప్పుడో మరి కాసేపట్లోనో వస్తాడు. ఆయనకి ఏం చెప్పుకోవాలి? పదే పదే అదే ఆలోచన! తలుచుకుంటేనే ఆమెకు భయంతో వణుకొస్తోంది. ఎవరో పిల్ల నెత్తుకుని పాలిచ్చినట్టు తెలిస్తేనే ఊరుకోని వ్యక్తి, అటువంటి పిల్లని ఇక మీదట తమ స్వంత బిడ్డలాగా ఇంట్లోనే పెట్టుకుని సాకాలని తెలిస్తే ఇంకేవన్నా వుందా? తనని బతకనిస్తాడా? ఇప్పుడో మరో క్షణంలోనో ఆయన వచ్చేస్తారు. అయ్యయ్యో, ఏం చెయ్యాలిరా భగవంతుడా? వణికి పోయింది వసుధ.

భయం, అధైర్యం, కోపం, ఏడుపూ అన్నీ ఒకేసారి చుట్టుముట్టి ఆమెను అబలను చేశాయి. జీవితంలో ఇంత విపత్కర పరిస్థితి తన కెప్పుడూ ఎదురు కాలేదు. ఈ విషయంలో తనకు తోడు ఎవరూ రారిపుడు. తనే ఎదుర్కోవాలి. ఎలా?

ఇంతలో వెక్కి వెక్కి ఏడుస్తున్న బంగారి వసుధ వైపు చూస్తూ చెయ్యి చాచింది. కొట్టినా కోపం లేకుండా పలకరిస్తున్న ఆ చంటిదాన్ని చూడగానే పాలిచ్చిన మమకారం పులకించిపోయింది. చటుక్కున ఆమెను ఎత్తుకుని గుండెలకు హత్తుకుంది వసుధ. అంధకారంలో అమ్మతనం చిరుదీపంలా వెలిగి, ఏదో దారి చూపించినట్లయింది.

కళ్లు తుడుచుకుంది వసుధ. జరిగింది జరిగినట్లు భర్తకి చెప్పాలని నిర్ణయించుకుంది. తనేం తప్పు చెయ్యలేదు. ఆకలి వేసిన వాడికి అన్నం పెట్టినట్టే, పాలకోసం అల్లాడిన పసిపిల్లకి పాలిచ్చింది. ఆకలి తీర్చలేని తల్లి అధైర్యంతో వొదిలిపెట్టిపోతే తను కూడా తనకేం కానట్టు అలాగే వదిలెయ్యాలా పాలిచ్చిన పసిబిడ్డని? ఇది దైవ నిర్ణయం! ఆ విధంగా భర్త అంగీకరిస్తే సరే. అంగీకరించకపోతే, దేనికైనా తను సిద్ధమే. అవును. తనను ఇంట్లోంచి వెళ్లగొడతాడా? కానీ, నిజంగా ఆ పరిస్థితే వస్తే, వదలవలసి వస్తే ఇంటినీ, భర్తనీ కూడా వదులుకుంటుంది గాని, ఇద్దరు పిల్లల్నీ మాత్రం వదిలేది లేదు!! గట్టిగా నిర్ధారించుకుంది వసుధ. ఇద్దరి బిడ్డల్నీ గుండెలకి హత్తుకుంది.

ప్రతి తల్లికీ ఏక కాలంలో ఇద్దరి బిడ్డలకి పాలిచ్చే వీలిచ్చాడు దేవుడు. ఒకటి తన బిడ్డకీ, రెండోది తల్లి పాలకి నోచుకోని పరాయి బిడ్డకీ. ఆ వరాన్ని ఎందుకు కాదనుకోవాలి?

*



## నిర్మాతగా మారనున్న నమిత?

'జగన్మోహిని' సక్సెస్ తరువాత, నమిత విజృంభించి మరిన్ని సినిమాలు చేస్తుందని, లేదు...ఆమె బాలీవుడ్‌కి తరలిపోతోందని రకరకాల పుకార్లు వినిపించాయి. అయితే పై రెండూ కాకుండా నమిత తన దృష్టిని నిర్మాణ రంగం వైపు సారించిందని పలువురు అంటున్నారు. బాలీవుడ్‌లో పోటీ అధికంగా ఉందని, అక్కడికెళ్లి అవకాశాలు వెతుక్కోవడం ఎందుకు? అన్న నయనతార అభిప్రాయంతో నమిత ఏకీభవిస్తోంది. బాలీవుడ్‌కి వెళ్లడం కన్నా దక్షిణాది చిత్రాలు చేయడమే సుఖంగా ఉంటుందని నమిత చెబుతోంది. అయితే ఇక నుంచి తన సినిమాలు తానే నిర్మించాలన్న ఆలోచనలో నమిత ఉన్నదట! దీని మీద కసరత్తు ప్రారంభించిందట. అదీ సంగతి!